www.jananinadam.com Follow :

RNI NO:TGTEL/25/A0870

# జన నినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినప్రతిక

**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న **జననినాదం** తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను, సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460

సంపుటి: 1 సంచిక: 21 | Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , & Hyderabad. | బుధ వారం 25-06- 2025 | పేజీలు : 4 | వెల : రూ.2.00

# ప్రతిష్టాత్మకంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు



**రాజకీయాలకు అతీతంగా ఉత్సవాల నిర్వహణ**

**భక్తులకు ఇబ్బంది లేకుండా పక్కాగా ఏర్పాట్లు**

**అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష**

**పటిష్టాంగా ఏర్పాట్లు చేయాల మంత్రి పొన్నం సూచన**

హైదరాబాద్, : చారిత్రాత్మకమైన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు రాజకీయాలకు అతీతంగా అత్యతం వైభవంగా చేసుకుందామని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. నగరంలో ఎంతో వైభవంగా జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలపై ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం పక్షాన ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా స్థానికుల సహకారం లేకపోతే విజయవంతం కాదన్నారు. గత సంవత్సరం ఏమైనా పొరపాటు జరిగితే సమీక్షించుకుని మరిన్ని ఏర్పాట్లు చేయడానికి ఈ సమీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవాలయ ఏర్పాట్ల కోసం భాగస్వామ్యం అవుతున్న అందరికీ అభినందనలు తెలియజేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సికింద్రాబాద్ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జులై 13న ఉజ్జయిని మహంకాళి బోనాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రజలందరి సహకారంతో బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. రాజకీయాలకు అతీతంగా అమ్మవారి బోనాలు నిర్వహించుకోవాలన్నారు. గతేడాది ప్రభుత్వం తరపున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా బోనాలు నిర్వహించామని గుర్తు చేశారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బోనాలతో వచ్చే మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆలయం లోపల కేబుల్ వైర్‌లు కొత్తవి వేసి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. భారీ కెడింగ్ జాలి ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆతిథ్యం ఇవ్వడంలో హైదరాబాద్ నగర ప్రజలు ఎవరికీ తీసి పోరన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు స్థానిక హైదరాబాద్ ప్రజలు వారి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. ఒక్కో వారం ఒక్కో ఏరియాలో పండుగ జరుగుతుంది కాబట్టి ఆయా ప్రాంతాల్లో వాటర్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. అవసరమైతే రెండుసార్లు నీటిని ఇవ్వాలని ఆదేశించారు. హైదరాబాద్ మొత్తం ఒకేసారి పండుగ జరిగితే కొంత ఇబ్బంది ఉంటుందని.. కానీ ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉంటుందని, భద్రత విషయంలో పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని.. ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచిం చారు. 3600 దేవాలయాలకు సంబంధించి సమీక్ష రాష్ట్ర స్థాయి అధికారులతో జరిగిందని తెలిపారు. గోల్కొండ, ఉజ్జయిని మహం కాళి, బల్కంపేట, లాల్ దర్వాజా ఇలా ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని.. జోగిని వాళ్ళకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. తమకు బోనం ఎత్తుకునే వారే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బోనాల సమయంలో కాకుండా రద్దీ తక్కువ ఉన్న సమయంలో వీఐపీ వస్తే ఇబ్బందులు ఉండవన్నారు. ఉజ్జయిని మహంకాళి బోనాలు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలని తెలిపారు. డెక్కన్ మానవ సేవ సమితి, ఇతర సంస్థలు ఇక్కడ చాలా సేవ కార్యక్రమాలు చేస్తున్నాయన్నారు. అందరూ వారి సహకారం అందించి ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తలసాని, జిల్లా కలెక్టర్ హరిచందన, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత పాల్గొన్నారు.

మేడ్ఇన్ ఇండియా ఆయుధాలతో

శత్రువును 22 నిమిషాల్లోనే

# మోకాళ్లపై కూర్చోబెట్టాం

**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి సంచలన వ్యాఖ్యలు**



ఢిల్లీ,:'ఆపరేషన్ సిందూర్'పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ కఠినమైన విధానాన్ని ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి స్పష్టం చేసిందన్నారు. ఉగ్రవాదంపై భారత్ దృఢవైఖరిని ఆపరేషన్ సిందూర్ నిరూపించిం దని వ్యాఖ్యానించారు. భారత్‌పై ఉగ్రదాడులను సహించేది లేదన్నారు. ముష్కరులు ఎక్కడ నక్కినా అంతం చేస్తామని మోదీ తీవ్రంగా హెచ్చరించారు. జాతి ప్రయోజనాల దృష్ట్యా తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ.. 'భారత్‌పై ఉగ్రదాడులను సహించేది లేదు. మన దేశంపై దాడులకు పాల్పడిన ముష్కరులు ఎక్కడ నక్కినా విడిచిపెట్టం. పాకిస్థాన్‌తో జరిగిన ఘర్షణలో భారతదేశంలో తయారైన ఆయుధాలు తమ ప్రభావాన్ని చూపించాయి. రక్షణ రంగంలో ఆత్మనిర్భరత సాధించాం. సైనిక అవసరాల కోసం విదేశాలపై మనం ఇప్పుడు తక్కువగా ఆధారపడుతున్నాం. ఆపరేషన్ సిందూర్‌లో దీని ప్రభావం కనిపించింది. దేశీయంగా తయారైన ఆయుధాలతో 22 నిమిషాల్లోనే పాకిస్థాన్‌ను మన సైన్యం మోకాళ్లపై కూర్చోబెట్టింది. భారతీయుల రక్తాన్ని పారించిన ఉగ్రవాదుల స్థావరాలు ఎక్కడా సురక్షితం కాదని నిరూపించాం' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

# బండి సంజయ్‌కు సిట్ నోటీసులు

## కాంగ్రెస్ రాజకీయ వ్యూహమా?

హైదరాబాద్,జూన్ 24, : ప్రస్తుతం ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసుల విచారణ బీఆర్ఎస్ ముఖ్య నేతలనే లక్ష్యంగా చేసుకుని సాగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రికి, ఈ కేసును విచారిస్తున్న సిట్ నోటీసులు జారీ చేయడం ఇప్పుడు సంచలనంగా మారింది. గతంలో బండి సంజయ్ స్వయంగా తన ఫోన్‌ను నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో, ఫోన్ ట్యాపింగ్ కేసును విచారి స్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసులో ఆయన్ను బాధితుడిగానూ, ఓ సాక్షిగానూ విచారించాలని సిట్ నిర్ణయించింది. అయితే, ఈ నోటీసులు జారీ వెనుక బలమైన రాజకీయ వ్యూహం కూడా దాగి ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇది పక్కా కాంగ్రెస్ మార్క్ రాజకీయంగా చెబుతున్నారు.కేంద్రమంత్రి బండి సంజయ్‌కు నోటీసులు ఇవ్వడం ద్వారా రెండు రాజకీయ లక్ష్యాలను కాంగ్రెస్ ప్రభుత్వం సాధించేందుకు ఉపయోగపడుతుందని అర్థం అవుతోంది.. బీఆర్ఎస్అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతల ఫోన్లను పెద్ద ఎత్తున ట్యాప్ చేశారన్న ఆరోపణలు బలంగా వచ్చాయి. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సహా, కీలక ప్రతిపక్ష నేతలంతా కేసీఆర్ ప్రభుత్వం తమ ఫోన్లను ట్యాప్ చేస్తోందని ఆరోపించారు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ విషయంపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ విషయం లో విచారణ ప్రారంభించింది. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.ఈ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావు, ఎస్.ఐ.బీ



మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు, రిటైర్డ్ డీసీపీ రాధా కిషన్ రావు, అదనపు ఎస్పీ భుజంగరావు, అదనపు ఎస్పీ తిరుపతన్నను సిట్ విచారణ చేసింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి జైపాల్ రెడ్డి, వికారాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నేత పటోళ్ల మహిపాల్ రెడ్డి సిట్ ఎదుట తమ వాంగ్మూలం ఇచ్చారు. వై.ఎస్ షర్మిళ ఫోన్ కూడా ట్యాప్ అయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బీజేపీ సీనియర్ నేత, కేంద్రమంత్రి బండి సంజయ్‌కు కూడా సిట్ నోటీసులు జారీ చేసింది. దీని ద్వారా తెలంగాణలో ఉన్న ప్రతిపక్ష నేతలందరి ఫోన్లను అక్రమంగా అధికారంలో ఉన్నప్పుడు ట్యాప్ చేసిందని ప్రజల ముందు చెప్పే ప్రయత్నం ఇది.బండి సంజయ్ పలు మార్లు తన ఫోన్‌ను కేసీఆర్ ప్రభుత్వం ట్యాప్ చేసిందని ప్రతిపక్ష నేతగా చెప్పారు. ఈ విషయంలో బీజేపీని భాగస్వామిగా చేయడం ద్వారా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఈ విష యాన్ని బలంగా ఉపయోగించుకోవడం కాంగ్రెస్ ప్రధాన వ్యూహంగా చెప్పవచ్చు. దీంతోపాటు, బండి సంజయ్ వంటి కీలక నేతల ఫోన్లు ట్యాప్ చేస్తూ ప్రజాస్వామ్య విలువలకు బీఆర్ఎస్ ముఖ్య నేతలు తిలోదకాలిచ్చారని, నేతల గోప్యతను హరించిన ప్రభుత్వంగా బీఆర్ఎస్‌ను ప్రజల ముందు దోషిగా నిలబెట్టే వ్యూహం ఇందులో దాగి ఉంది. కీలక ప్రతిపక్ష నేతలందరి ఫోన్లు ట్యాప్ చేయడం వెనుక ముఖ్య సూత్రధారులు కేసీఆర్, కేటీఆర్ వంటి ముఖ్య నాయకులే అని చెప్పే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోంది. బండి సంజయ్ లాంటి ముఖ్య నేతలకు నోటీసులు ఇచ్చి ఈ కేసులో సాక్షిగా పిలవడం అంటే బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్, కేటీఆర్ వంటి వారిపై చర్యలకు మార్గం సుగమం చేసే వ్యూహంగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నా రు. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లు, ఈ కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్‌కు నోటీసులు ఇవ్వడం కేవలం బీఆర్ఎస్‌ను దెబ్బ తీయడం మాత్రమే కాకుండా, బీజేపీని కూడా ఇందులోకి లాగే వ్యూహం కనిపిస్తోంది. గత కొంత కాలంగా బీజేపీ - బీఆర్ఎస్ మధ్య రహస్య స్నేహం దాగి ఉందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగ్ విషయంలో బండి సంజయ్‌కు నోటీసులు ఇవ్వడం ద్వారా ఈ కేసు ద్వారా బీజేపీ పైన ఒత్తిడి పెంచే వ్యూహం కనిపిస్తోంది.ఫోన్ ట్యాపింగ్ విషయంలో బీజేపీ గట్టిగా మాట్లాడకపోతే, బీజేపీ - బీఆర్ఎస్‌ల మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయని ప్రజల ముందు ఆ పార్టీని ఎండగట్టే అవకాశం కలుగుతుంది. ఒకవేళ బీజేపీ నేతలు గట్టిగా మాట్లాడితే, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్, కేటీఆర్ వంటి వారిపై చర్యలు తీసుకునేందుకు కాంగ్రెస్‌కు నైతిక మద్దతు దొరికినట్లు అవుతుంది. కేవలం బీఆర్ఎస్ పై కోపంతో తాము ఈ చర్యలకు దిగలేదని, అటు కాంగ్రెస్-బీజేపీ వంటి ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేయడం అతి పెద్ద కుట్రగా అన్ని పార్టీలు భావిస్తున్నాయని చెప్పుకునే అవకాశం కాంగ్రెస్‌కు లభిస్తోంది. ప్రజల్లో ఇది ప్రతీకార కేసుగా కాకుండా, తాము పారదర్శకంగానే ఈ కేసు విచారణ చేపడుతున్నట్లు కాంగ్రెస్ సర్కార్ చెప్పుకునే అవకాశం ఉంది. బీజేపీ నేతలు ఈ కేసులో తీవ్రంగా స్పందించకపోతే మాత్రం, బీఆర్ఎస్ - బీజేపీలు కుమ్మక్కయ్యాయని ప్రజల ముందు చెప్పే అవకాశం కలుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, బీజేపీ భుజం మీద తుపాకి పెట్టి బీఆర్ఎస్‌ను కాల్చడం అని చెప్పాలి. రాజకీయంగా బీజేపీ-బీఆర్ఎస్‌లను ఈ వ్యూహంతో డిఫెన్స్‌లోకి నెట్టే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని చెప్పాలి.బీఆర్ఎస్, బీజేపీలను ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు ద్వారా ఇరుకున పెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ లక్ష్యమని తెలుస్తోంది.

# విజయోత్సవాలు కాదు.. రైతులకు క్షమాపణ చెప్పాలి : హరీశ్ రావు




హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల ముందు రైతు భరోసా పేరిట ఆడుతున్న డ్రామాలు ఆపి, 19 నెలల కాలంలో రైతన్నను అరిగోస పెట్టుకున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఎకరాకు 15,000 చొప్పున ఇస్తామని చెప్పి 12,000కి పరిమితం చేయడం మోసం చేయడమే అని ధ్వజమె త్తారు. గత వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టి, యాసంగిలో ఎగ్గొట్టి, ఓట్ల కోసం ఇప్పుడు విజయోత్సవాల పేరిట సంబరాలు జరపడం రైతులను మోసం చేయడమే అని మండిపడ్డారు. చెప్పింది కొండంత, చేసింది గోరంత. ఎన్నికల ప్రచారంలో రైతులను మభ్య పెట్టావు. అధికారంలోకి వచ్చాక నిండా ముంచావు. రైతులకు ఏం చేశావని సంబరాలు చేస్తున్నావ్ రేవంత్ రెడ్డి..? రెండు సీజన్ల రైతు భరోసా ఎగ్గొట్టినందుకా? కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వనందుకా? రైతు కూలీలందరికి ఆత్మీయ భరోసాఅనిఇవ్వకుండామోసం చేసినం దుకా? రుణమాఫీ చారణ చేసి బారాణ మందిని మోసం చేసినం దుకా? అన్ని పంటలకు బోనస్ అని, సన్నాలకే పరిమితం చేసినందు కా? 1200 కోట్ల బోనస్ డబ్బులు చెల్లించినందుకా? ప్రీమియం చెల్లించక రైతు బీమా అమలు ప్రశ్నార్థకం చేస్తున్నందుకా? పంట బీమా అని చెప్పి ఉసురుమనిపించినందుకా? దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసినందుకా? లగచర్ల, రాజోలి రైతుల చేతులకు బీడీలు వేసినందుకా? ఏడాదిన్నర పాలనలో ఒక్క చెరువు నింపకుండా, ఒక్క చెక్ డ్యాం కట్టకుండా, కొత్తగా ఒక్క ఎకరాకు నీళ్ళు ఇవ్వనందుకా? ధాన్యం కొనుగోళ్ళ సక్రమంగా జరపనందుకా? జనుము, జీలుగు విత్తనాల ధరలు పెంచి, రైతులకు సకాలంలో అందించినందుకా? వరంగల్ రైతు డిక్లరేషన్ ను అటకెక్కించినందుకా? మీ దుర్మార్గ పాలనలో 511 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా? ఎందుకు సంబురాలు చేస్తున్నావు రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు రైతుల బతుకులు సంక్షోభంలో కూరుకుపోయాయి. బిఆర్ఎస్ పాలనలో ఎలాంటి ఆందోళన లేకుండా ఉన్న రైతన్న నేడు ప్రభుత్వ పథకాలు అందక పంట పొలాల్లోనే కుప్ప కూలుతున్నడు. బీఆర్ఎస్ పార్టీది రైతు సంక్షేమ ప్రభుత్వం అయితే, కాంగ్రెస్ పార్టీది రైతు సంక్షోభ ప్రభుత్వం. కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతు బంధు ఇస్తే, మీరు ఓట్లకు ఓట్లకు మధ్య రైతు భరోసా ఇచ్చి మభ్య పెట్టాలని చూస్తున్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో చేస్తున్న నీ జిమ్మిక్కులను రైతులు నమ్మరు. రైతులను కన్నీళ్లు పెట్టించినందుకు, ఉసురు తీసుకున్నందుకు విజయోత్సవాలు కాదు క్షమాపణలు చెప్పండి. ఇచ్చిన హామీలు ఇప్పటికైనా అమలు చేయండి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# పహల్గామ్ దాడిపై కొనసాగుతున్న ఎన్ఐ దర్యాప్తు

**ఉగ్రవాదుల ప్రవేశంపై కూపీ లాగుతున్న పోలీసులు**

న్యూఢిల్లీ, : పహల్గామ్ ఉగ్ర దాడిపై కేంద్ర సంస్థ ఎన్ఐఏ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇప్పటికే కీలక ఆధారాలను సేకరించింది. తాజాగా ఉగ్రవాదులు భారత్‌లోకి ఎలా ప్రవేశించారన్న దానిపై దర్యాప్తు చేపట్టగా అధికారులకు కీలక సమాచారం లభించింది. బాట్కోట్‌కు చెందిన పర్వైజ్ అహ్మద్ జోథర్, హిల్ పార్క్‌కు చెందిన బషీర్ అహ్మద్ జోథర్‌లను అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిద్దరు ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించినట్లుగా ఒప్పుకున్నారు. ఇక పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత.. ముగ్గురు ఉగ్రవాదులకు హిల్ పార్క్‌లోని ఒక గుడిసెలో ఉన్నట్లుగా తేలింది. ఈ ఉగ్రవాదులకు స్థానికులైన పర్వైజ్, బషీర్ ఆహారం, ఇతర వసతులు కల్పించినట్లుగా తేలింది. అంతేకాకుండా ఎప్పటికప్పుడు కమ్యూనికేషన్ చేరవేసినట్లుగా గుర్తించారు. ఇక ముగ్గురు ఉగ్రవాదులు.. పాకిస్థాన్‌లోని అబోటాబాద్ నుంచి ముజఫరాబాద్ మీదుగా పూంజ్-రాజౌరికి చేరుకున్నట్లు అధికారులు గుర్తించారు. సరిహద్దు కారిడార్ ద్వారా భారత్‌లోకి ప్రవేశించి ఉంటారని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఇక




నిఘా వర్గాల దర్యాప్తు మేరకు.. ముగ్గురు ఉగ్రవాదులు కూడా అధిక శిక్షణ పొందినవారుగా కనిపెట్టారు. శిక్షణలో అధునాతన పోరాట పటిమలు కలిగిన వారిగా తేల్చారు. అంతేకాకుండా రహస్య కదలికలు, మనుగడ వ్యూహాలు కలిగి ఉన్నట్లుగా తేలింది. పహల్గామ్‌కు ముందు జమ్మూకాశ్మీర్‌లోని స్పిన్నర్ ప్రాంతంలో జరిగిన దాడులతో పాటు పలు దాడుల్లో ఈ ముగ్గురు ఉగ్రవాదులు పాల్గొని ఉండొచ్చని భావిస్తున్నారు. ఇక ఉగ్రవాదుల కదలికలు గురించి డిజిటల్ పాదముద్రలు, కమ్యూనికేషన్ మార్గాలను దర్యాప్తు సంస్థ విశ్లేషిస్తోంది.

# నీరసపడిన అధికార పార్టీ సోషల్ మీడియా




హైదరాబాద్, జూన్ 24, : 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికలకు ముందు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికలు అత్యంత చురుకుగా, ఉత్సాహభరితంగా కనిపించాయి.ఎన్నికల్లో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. డిజిటల్ యుగంలో పార్టీల గెలుపు ఓటములు, పథకాల అమలు, ఇతర అంశాలన్నీ సోషల్ మీడియా ద్వారానే ప్రజలకు చేరుతున్నాయి. దీంతో నేతల పనితీరుకు సోషల్ మీడియా కొలమానంగా మారింది. 2023 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలుపు, బీఆర్ఎస్ ఓటమికి సోషల్ మీడియా కీలక పాత్ర పోసించింది. అయితే ఇప్పుడు అధికార కాంగ్రెస్ సోషల్ మీడియా బలహీనపడింది.2023 తెలంగాణ శాసనసభ ఎన్నికలకు ముందు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికలు అత్యంత చురుకుగా, ఉత్సాహభరితంగా కనిపించాయి. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో, కాంగ్రెస్ సోషల్ మీడియా బృందాలు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు, ప్రజల సమస్యలను హైలైట్ చేయడం, పార్టీ హామీలను ప్రచారం చేయడంలో నిరంతరం కృషి చేశాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, సోషల్ మీడియా వారియర్స్ నిమిషం నిమిషం కొత్త వ్యూహాలతో ప్రత్యర్థి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పై దాడి చేశారు. ట్విట్టర్ (ఇప్పుడు ఎక్స్), ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో వీడియోలు, మీమ్స్, గ్రాఫిక్స్, లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రజలతో నేరుగా సంబంధం ఏర్పరచుకున్నారు. ఈ కాలంలో, సోషల్ మీడియా యాక్టివిస్టులు పార్టీ కోసం అహర్నిశలు పనిచేసి, ఎన్నికల విజయంలో కీలక పాత్ర పోషించారు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే, సోషల్ మీడియా వేదికల ఉత్సాహంలో మార్పు కనిపిస్తోంది. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత, సోషల్ మీడియా ద్వారా ప్రజలతో సంబంధం కొనసాగించడంలో కొంత నీరసం కనిపిస్తోంది. ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉండగా చూపిన చొరవ, ప్రభుత్వంలోకి వచ్చాక కొంత తగ్గినట్లు ఎక్స్‌లో కొన్ని పోస్టులు సూచిస్తున్నాయి. ప్రభుత్వ విజయాలు, సంక్షేమ పథకాలను ప్రచారం చేయడంలో సోషల్ మీడియా బృందాలు కొంత వెనుకబడినట్లు విమర్శలు వస్తున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రత్యర్థులు సోషల్ మీడియాలో చురుగ్గా ఉండగా, కాంగ్రెస్ ఈ విషయంలో వ్యూహాత్మకంగా స్పందించడంలో వెనుకబడినట్లు కనిపిస్తోంది.ఎన్నికల విజయంలో సోషల్ మీడియా వారియర్స్ శ్రమ అపారమైనది. వీరు గ్రామీణ స్థాయి నుంచి నగరాల వరకు పార్టీ సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. అయితే, ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటుతున్నా, ఈ కార్యకర్తలకు తగిన గుర్తింపు, పదవులు లభించకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ కార్యకర్తలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిద్రాహారాలు మాని పనిచేశారని, కానీ అధికారంలోకి వచ్చాక వారి కృషిని పార్టీ నాయకత్వం గుర్తించడం లేదనే ఆవేదన స్పష్టంగా కనిపిస్తోంది. ఇది పార్టీలో అంతర్గత అసంతృప్తిని పెంచే అవకాశం ఉంది.ప్రభుత్వంలో ఉన్నప్పుడు సోషల్ మీడియా వ్యూహం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కంటే భిన్నంగా ఉండాలి. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా కీలకం. ఉదాహరణకు, ఆరు గ్యారంటీల అమలు, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయవచ్చు. అయితే, ప్రస్తుతం ఈ దిశలో చురుకైన ప్రయత్నాలు కొరవడినట్లు కనిపిస్తోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ సోషల్ మీడియా చైర్‌పర్సన్ సుప్రియా శ్రీనాటే నాయకత్వంలో ప్లాట్‌ఫారమ్‌లు బలోపేతమైనప్పటికీ, రాష్ట్ర స్థాయిలో ఇదే స్థాయి చురుకుదనం కనిపించడం లేదుసోషల్ మీడియా కార్యకర్తలకు పదవులు, గుర్తింపు ఇవ్వడం కేవలం వ్యక్తిగత ప్రయోజనం కోసం మాత్రమే కాదు, పార్టీని బలోపేతం చేయడానికి కూడా అవసరం. ఈ కార్యకర్తలు గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల వరకు పార్టీ సందేశాన్ని అందించగల సామర్థ్యం కలిగి ఉన్నారు. వీరికి తగిన ప్రోత్సాహం, బాధ్యతలు అప్పగించడం ద్వారా సోషల్ మీడియా బందాలు మరింత ఉత్సాహంగా పనిచేస్తాయి. సోషల్ మీడియా కమిటీలలో బాధ్యతలు ఇస్తే, ఇది ఇతర కార్యకర్తలకు స్ఫూర్తిగా ఉంటుంది. గుర్తింపు లేని కార్యకర్తలలో నిరాశ పెరిగితే, భవిష్యత్ ఎన్నికలలో సోషల్ మీడియా శక్తి బలహీనపడే ప్రమాదం ఉంది.భవిష్యత్ వ్యూహం..తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా బృందాలు భవిష్యత్తులో మరింత చురుకుగా మారాలంటే, కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి.ప్రభుత్వ విజయాల ప్రచారం: సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఆకర్షణీయమైన వీడియోలు, గ్రాఫిక్స్ ద్వారా ప్రజలకు చేరవేయాలి.కార్యకర్తల ప్రోత్సాహం: సోషల్ మీడియా కార్యకర్తలకు రాష్ట్ర స్థాయిలో కమిటీలలోబాధ్యతలు,గుర్తింపు ఇవ్వడం ద్వారావారిఉత్సాహాన్ని పెంచాలి.లప్రత్యర్థులకు సమాధానం: బీఆర్ఎస్, బీజేపీ సోషల్ మీడియా దాడులకు వాస్తవాలతో, వ్యూహాత్మకంగా స్పందించాలి.స్థానిక సమస్యలపై దృష్టి: గ్రామీణ స్థాయిలో ప్రజల సమస్యలను సోషల్ మీడియా ద్వారా హైలైట్ చేసి, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రచారం చేయాలి.

ఎన్నికల ముందు ఎట్ల ఉండే కాంగ్రెస్ సోషల్ మీడియా ఎన్నికల తరువాత ఎట్లా ఉంది కాంగ్రెస్ సోషల్ మీడియా .

## లడ్డూ కష్టాలకు ఫుల్ స్టాప్..



తిరుమల, జూన్ 24,: తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ గుడ్ న్యూస్ చెప్పింది. భక్తులకు లడ్డూ కష్టాలు తొలగించేందుకు కియోస్క్ మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. దర్శన టికెట్ లేదా ఆధార్ నెంబర్ ను కియోస్క్ మిషన్ లో ఎంటర్ చేసి అక్కడ కనిపించే క్యూఆర్ కోడ్ పై పేమెంట్ చేస్తే రసీదు వస్తుంది. అది తీసుకెళ్లి కౌంటర్ లో అందిస్తే లడ్డూలు పంపిణీ చేస్తారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని భక్తుల సేవలు మరింత సులభతరం చేసే విధంగా టీటీడీ వినూత్న ఏర్పాట్లు చేసింది. తిరుమలలో లడ్డూ కౌంటర్ల వద్ద కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేసింది. సాధారణంగా లడ్డూ ప్రసాదం కావాలంటే నేరుగా కౌంటర్ వద్దకు వెళ్లి ఆధార్ కార్డ్ లేదా దర్శన టికెట్లు చూపించి భక్తులు లడ్డూలు తీసుకునే వారు. అయితే, టీటీడీ నూతన విధానం తీసుకొచ్చింది. ప్రయోగాత్మకంగా 5 కియోస్క్ మెషీన్లను లడ్డూ కౌంటర్ల దగ్గర ఏర్పాటు చేసింది.ఈ మెషిన్ లో భక్తులు తమ దర్శన టికెట్ టోకెన్ నెంబర్ లేదా ఆధార్ నెంబర్ ఎంటర్ చేయాలి. ఆ తర్వాత వారికి క్యూఆర్ కోడ్ వస్తుంది. దాన్ని ఫోన్ లో స్కాన్ చేయడం ద్వారా పేమెంట్ చేయాలి. ఆ తర్వాత ఒక స్లిప్ వస్తుంది. దాన్ని కౌంటర్ లో చూపిస్తే లడ్డూలు ఇస్తారు. దర్శన టికెట్ లేని భక్తులు సైతం లడ్డూలను పొందొచ్చు. అలాంటి భక్తులు తమ ఆధార్ నెంబర్ ను కియోస్క్ మెషిన్ లో నమోదు చేసి రెండు లడ్డూలను పొందొచ్చు. ఈ కొత్త సిస్టమ్ ని టీటీడీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే ఈ విధానం అన్నప్రసాదంలో ఉంది. డోనర్లు 99వేల రూపాయల వరకు నేరుగా డొనేషన్ చేసుకునే విధంగా ఇలాంటి కియోస్క్ మిషన్లు పెట్టింది.తాజాగా తిరుమల లడ్డూ కౌంటర్లలో కూడా కియోస్క్ మిషన్లను టీటీడీ ఏర్పాటు చేసింది. భక్తులు మరింత సులభతరంగా లడ్డూలు పొందే అవకాశం ఉందని టీటీడీ అంటోంది. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రస్తుతం 5 కియోస్క్ మిషన్లు ఏర్పాటు చేశారు. భక్తులు వీటి ద్వారా లడ్డూలు పొందుతున్నారు. కొన్ని రోజుల పాటు దీన్ని పరిశీలన చేసి ఇందులో ఏవైనా లోటుపాట్లు ఉంటే సరి చేసే విధంగా టీటీడీ దృష్టి పెట్టింది. అన్నప్రసాదం కేంద్రంలో డొనేషన్లు సమర్పించడానికి, లడ్డూలు పొందడానికి కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేసిన టీటీడీ త్వరలో గదులు పొందడానికి కూడా కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం.

# జగన్ ఎమెర్జెన్సీ మీటింగ్...



కడప, జూన్ 24,: ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తోంది కూటమి. కేసులతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు ఆ పార్టీ నేతలు. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డి సైతం కూటమిని టార్గెట్ చేస్తున్నారు. తాజాగా జగన్మోహన్ రెడ్డి పల్నాడు పర్యటనలో సింగయ్య అనే వైసిపి కార్యకర్త మృతి రాజకీయ రంగు పులుముకుంది. జగన్ ప్రయాణిస్తున్న వాహనం ఢీ కొట్టి సింగయ్య మృతి చెందాడని పోలీసులు నిర్ధారించారు. అందుకు సంబంధించి వీడియో ఒకటి బయటకు రావడంతో జగన్మోహన్ రెడ్డి పై కేసు నమోదు అయింది. ఆయనపై మోపిన సెక్షన్లు కూడా ఆందోళనకరంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ముఖ్య నేతలతో జగన్మోహన్ రెడ్డి సమావేశం అయ్యారు. చాలా విషయాలపై చర్చించారు. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న నేతలతో చర్చలు జరిపారు. ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ ముఖ్య నేతలతో సమావేశం జరపాలని నిర్ణయించారు.పల్నాడు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత విగ్రహ ఆవిష్కరణకు జగన్మోహన్ రెడ్డి హాజరయ్యారు. అయితే గతంలో జగన్మోహన్ రెడ్డి జిల్లాల పర్యటనల సందర్భంగా ఎదురైన పరిణామాల దృష్ట్యా కొన్ని ఆంక్షలు విధించారు ఏపీ పోలీసులు. కేవలం 11 వాహనాలతో కాన్వాయ్ గా వెళ్లాలని.. 100 మందితో విగ్రహ ఆవిష్కరణ జరుపుకోవాలని సూచించారు. కానీ జగన్మోహన్ రెడ్డి మాత్రం తాడేపల్లి నుంచి 50 వాహనాలతో కాన్వాయ్ గా వెళ్లారు. స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు భారీగా జన సమీకరణ చేశారు. ఈ తరుణంలోనే సింగయ్య మృతి చెందడం సంచలనంగా మారింది. అందుకు సంబంధించి వీడియోలు సైతం బయటకు వచ్చాయి. అయితే ఆ వీడియోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో సృష్టించినవని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు అనుమానిస్తున్నారు. పోలీసులు మాత్రం కఠిన సెక్షన్లు నమోదు చేశారు. నాన్ బెయిలబుల్ కింద అరెస్టులు చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఇది జీవిత ఖైదుకు సంబంధించిన సెక్షన్లు అని అనుమానాలు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఈ నెల 25న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ ముఖ్యులు తాడేపల్లి కార్యాలయానికి హాజరుకావాలని సమాచారం ఇచ్చారు.జగన్మోహన్ రెడ్డిని టార్గెట్ చేసుకొని కూటమి ప్రభుత్వం పాలు కదుపుతోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ కేసులో జగన్మోహన్ రెడ్డి అరెస్టు తప్పదని ప్రచారం సాగుతోంది. అందుకే జగన్ పునరాలోచనలో పడ్డారు. పార్టీ ముఖ్య నేతల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఉద్దేశపూర్వకంగానే జగన్మోహన్ రెడ్డి చుట్టూ కుట్ర జరుగుతోందన్న అనుమానాలు ఉన్నాయి. జగన్ బయటకు వస్తుండడంతో జనాదరణ పెరిగిందని.. దానిని నియంత్రించేందుకే ఇలా చేస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయి. మరోవైపు జూలై 8న వైయస్సార్ జన్మదినం. ఆరోజు ఇడుపాలపాయలో నివాళులు అర్పించేందుకు జగన్ వెళ్ళనున్నారు. అదే రోజు నుంచి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడతారని తెలుస్తోంది. అందుకే పార్టీ ముఖ్యులతో ముందుగా సమావేశం కానున్నట్లు తెలుస్తోంది.వాస్తవానికి జగన్మోహన్ రెడ్డి జిల్లాల పర్యటనకు ఏనాడో వెళ్లాల్సి ఉంది. సంక్రాంతి కంటే ముందే జిల్లాల పర్యటనకు సంబంధించి కీలక ప్రకటన చేశారు జగన్ మోహన్ రెడ్డి. కానీ జిల్లాల పర్యటనకు వెళ్లలేదు. ఆ విషయంలో కాలయాపన జరుగుతోంది. ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి బయటకు వస్తుంటే జనాల ఆదరణ కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడితే మంచి ప్రయోజనం ఉంటుందని ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు జగన్మోహన్ రెడ్డిని నియంత్రించేందుకు అనేక రకాల కేసులను కూటమి తెరపైకి తెస్తోందన్న అనుమానాలు ఉన్నాయి. సరిగ్గా ఇదే సమయంలో ప్రజల మధ్యకు వెళితే వారి ఆదరణ తప్పకుండా లభిస్తుందని ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. మొత్తానికైతే ఈనెల 25న జరగనున్న కీలక సమావేశంలో జగన్మోహన్ రెడ్డి చాలా అంశాలపై క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది.

## ఏపీలో మరో నేషనల్ హైవేకు మహర్ధశ

విజయవాడ, జూన్ 24,: ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా 216హెచ్ జాతీయ రహదారికి మోక్షం కలిగింది. పెదన-లక్ష్మీపురం మధ్య 120.85 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారిని రూ.4245 కోట్లతో విస్తరించనున్నారు. ఈ హైవే గుడివాడ, హనుమాన్‌జంక్షన్, నూజివీడు మీదుగా లక్ష్మీపురం వరకు వెళ్తుంది. ఈ హైవే వల్ల పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో పాటు వాహనాల రద్దీ కూడా తగ్గుతుందని భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ హైవేలకు సంబంధించి కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ క్రమంలో మరో హైవేకు మోక్షం కలిగింది. 216హెచ్ జాతీయ రహదారిలో పెదన-లక్ష్మీపురం మధ్య విస్తరించనున్నారు. ఈ 216హెచ్ రహదారి 120.85 కి.మీ మేర నాలుగు వరుసలుగా రూ.4245 కోట్లు కేటాయించారు. ఈ హైవే విషయానికి వస్తే.. పెదన నుంచి మొదలై.. 'గుడివాడ, హనుమాన్‌జంక్షన్, నూజివీడు, విసన్నపేట మీదుగా లక్ష్మీపురం' వరకు వెళ్తుంది. ఈ రహదారి విస్తరణ వల్ల పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని.. అలాగే వాహనాల రద్దీ తగ్గుతుందని భావిస్తున్నారు.ఈ నేషనల్ హైవే విస్తరణలో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో 9 చోట్ల బైపాస్‌ను నిర్మించాలని ప్లాన్ చేశారు. గుడివాడలో 15.3 కిలోమీటర్ల మేర.. హనుమాన్‌జంక్షన్‌లో 12.5 కిలోమీటర్ల మేర.. గుడ్లవల్లేరులో 6.7 కిలోమీటర్ల మేర బైపాస్‌లు రానున్నాయి. అన్నవరంలో 2.9 కి.మీ మేర, పుట్టగుంటలో 2.4 కి.మీ చిన్న బైపాస్‌లు వస్తాయి. మొత్తం 54.6 కి.మీ మేర బైపాస్‌లు.. హనుమాన్ జంక్షన్‌లో రైల్వే లైన్ క్రాసింగ్ దగ్గర ఆర్వోబీ ప్లాన్ చేశారు. మరికొన్ని బ్రిడ్జిలు, కల్వర్టులు కూడా రానున్నాయి. ఈ మేరకు ఈ హైవేకు సంబంధించి అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు. ఈ హైవేకు అన్ని అనుమతులు అయ్యాక పనులు మొదలవుతాయంటున్నారు అధికారులు. ఈ హైవే విస్తరణ కోసం 700 ఎకరాల భూమిని సేకరించాలని.. దీనికి రూ.500 కోట్లు ఖర్చు అవుతుందని భావిస్తున్నారు. రెవెన్యూ అధికారులు భూమి ధరలను లెక్కించి.. ఆ తర్వాత దాని ప్రకారం పరిహారం అందజేస్తారు.ఈ నేషనల్ హైవేతో తెలంగాణకు, మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం కూడా ఏర్పడుతుందని చెబుతున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ గుట్టు విప్పేసారా..



హైదరాబాద్, జూన్ 24,: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితులైన మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుల వాంగ్మూలాలు దర్యాప్తును మరింత ఆసక్తికరంగా మార్చాయి. తాజాగా విచారణలో ప్రణీత్‌రావు అసలు గుట్టు విప్పారు.ప్రణీత్ రావు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం, 2018 నుంచే తెలంగాణలో రాజకీయ నాయకులు, ప్రముఖులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టుల ఫోన్లను అనధికారికంగా ట్యాప్ చేసినట్లు వెల్లడైంది. నాలుగేళ్ల కాలంలో వేల సంఖ్యలో ఫోన్లు ట్యాప్ చేయబడ్డాయి. ఇది గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన నిఘా కార్యకలాపాల తీవ్రతను సూచిస్తుంది. ఈ విషయం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది, ఎందుకంటే ఇది గోప్యతా హక్కుల ఉల్లంఘనతో పాటు, రాజకీయ దురుద్దేశాలను సూచిస్తుంది.ప్రణీత్ రావు వెల్లడించిన మరో కీలక అంశం ఏమిటంటే, ట్యాప్ చేసిన ఫోన్ సంభాషణల డేటాను పెన్ డ్రైవ్‌లో కాపీ చేసి ప్రభాకర్ రావుకు అందించినట్లు తెలిపాడు. ఈ డేటా ఎవరికి చేరిందనే విషయంపై ప్రణీత్ రావు తనకు తెలియదని చెప్పడం దర్యాప్తులో కొత్త సందిగ్ధతను సృష్టించింది. ఈ పెన్ డ్రైవ్ ఎవరి చేతుల్లోకి వెళ్లింది, దాని ద్వారా ఎలాంటి సమాచారం ఉపయోగించబడింది అనే ప్రశ్నలు ఇప్పుడు సిట్ దర్యాప్తు దృష్టిలో కీలకంగా మారాయి.ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రణీత్ రావు మరియు ప్రభాకర్ రావులను విడివిగా విచారిస్తోంది. ప్రణీత్ రావు తన చర్యలన్నీ ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే జరిగాయని చెబుతుండగా, ప్రభాకర్ రావు తాను ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, అన్నీ అప్పటి డీజీపీ సూచనల మేరకే జరిగాయని వాదిస్తున్నాడు. ఈ విరుద్ధమైన వాంగ్మూలాలు దర్యాప్తును మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. సిట్ ఇప్పుడు ఈ డేటా బదిలీ గొలుసు ఎక్కడిదాకా వెళ్లిందనే దానిపై దృష్టి సారించింది.ఈ కేసు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చను రేపుతోంది. కొందరు రాజకీయ నాయకులు, ముఖ్యంగా బీజేపీ నేత బండి సంజయ్, ఈ ట్యాపింగ్ వ్యవహారం గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికార దుర్వినియోగానికి నిదర్శనమని ఆరోపిస్తున్నారు. అయితే, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఈ ఆరోపణలను రాజకీయ కుట్రగా చిత్రీకరిస్తూ, దర్యాప్తును ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ రాజకీయ ఒత్తిళ్లు సిట్ దర్యాప్తును మరింత సవాలుగా మార్చాయి.సిట్ దర్యాప్తు ఇప్పుడు పెన్ డ్రైవ్ గమనాన్ని గుర్తించడంపై కేంద్రీకరించింది. ఈ డేటా ఎవరి చేతుల్లోకి వెళ్లింది, దానిని ఎలా ఉపయోగించారు అనే విషయాలు ఈ కేసు యొక్క తదుపరి దశను నిర్ణయిస్తాయి. అదనంగా, రివ్యూ కమిటీ నుంచి అనుమతులు ఎలా పొందారు, మావోయిస్టు ముసుగులో ఎలా ట్యాపింగ్ జరిగింది అనే అంశాలపై కూడా సిట్ ఆరా తీస్తోంది. ఈ కేసు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు లేదా రాజకీయ నాయకుల వరకు చేరే అవకాశం ఉంది, ఇది రాజకీయ రంగంలో మరింత గందరగోళాన్ని సృష్టించవచ్చు.

# అమరగానం... ఏమైంది...

విశాఖపట్టణం, జూన్ 24, : వైసీపీలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విపక్షాలపై ఒంటికాలు మీద లేచే గుడివాడ అమర్ నాథ్, ఇప్పుడు నోటికి అచితూచి పని చెబుతున్నారట. అసలు మీడియా ముందుకు రావడానికి కూడా ఇష్టపడట్లేదట. వైసీపీ ఘోర పరాజయం తర్వాత పార్టీ తరఫున మీడియా ముందుకు వచ్చి వాయిస్ వినిపించే అతి కొద్దిమంది నేతల్లో గుడివాడ ఒకరిగా ఉంటూ వచ్చారు.ఉమ్మడి విశాఖ జిల్లా రాజకీయాలు, సమస్యలు, రాష్ట్రస్థాయి అంశాలపై కూడా గుడివాడ అమర్ విశాఖ నుంచే గళం వినిపించేవారు. అయితే కొద్ది రోజులుగా ఆయన పూర్తిగా సైలెంట్ అయ్యారు. అసలు పార్టీలో ఉన్నారా.? లేరా అన్నట్లుగా మారిపోయింది ఆయన తీరు. పార్టీతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్న గుడివాడ తీరును చూసి ఆయన వెంట తిరిగే కొద్దిమంది నేతలే ఆశ్చర్యపోతున్నారట. సొంత పార్టీ నేతలే ఆయన సినిమా అయిపోయిందని చర్చించుకుంటున్నారట.పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత ఆప్తుడుగా చెప్పుకునే గుడివాడ అమర్నాథ్ ఇప్పుడు పార్టీకి టచ్ మీ నాట్ అన్నట్లుగా ఉండటానికి కారణాలేంటనే దానిపై రాజకీయవర్గాలలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. దీని వెనుక అత్యంత బలమైన కారణాలే ఉన్నాయట. రెండున్నరేళ్ల పాటు మంత్రి పదవి అనుభవించిన గుడివాడ అమర్‌నాథ్ పార్టీ అధినేత జగన్ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన వర్గీయులే చెబుతున్నారు.తాను కోరుకున్న నియోజకవర్గానికి తనను ఇంచార్జ్‌గా నియమించలేదన్న అసంతృప్తి ఆయనలో బాగా పెరిగిపోయిందంటున్నారు. అందుకే అధినేత జగన్‌పై గుడివాడ అమర్ తీవ్ర అసహనంతో ఉన్నారని విశాఖ వైసీపీలో చర్చ జరుగుతోంది. అందుకే పార్టీ ఆఫీస్ ముఖం కూడా చూడటం లేదట గుడివాడ అమర్. ఇందుకు కారణం ఆయన కోరుకున్న విశాఖ నగర నియోజకవర్గ ఇంచార్జ్ పదవి దక్కకపోవడమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.గత ఎన్నికల్లో గుడివాడ అమర్నాథ్ గాజువాక నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గాజువాక నుంచి టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాస్ గుడివాడ అమర్‌పై విజయం సాధించారు. దీంతో ఆయన ఏకంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడయ్యారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే గుడివాడ అమర్ విశాఖలో వాలిపోయారు. విశాఖ నగర పరిధిలో ఏదో ఒక నియోజకవర్గాన్ని తనకు అప్పగిస్తారని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.కానీ జగన్ మాత్రం గుడివాడకు విశాఖ నగరం, రూరల్ కూడా కాకుండా చోడవరం నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. దీంతో గుడివాడ తీవ్ర అసంతృప్తికి గురయ్యారట. అక్కడితో ఆగకుండా విశాఖ జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి కూడా గుడివాడను పీకేశారు జగన్. ఇది తనకు పొమ్మనలేక పొగపెట్టినట్లేనని భావిస్తున్నారట అమర్. 2019 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి పోటీ చేసి గెలిచి మంత్రిగా ఉన్న ఆయనను ఆ నియోజకవర్గ నుంచి తప్పించి చివరి నిమిషంలో గాజువాక టికెట్ ఇవ్వడమే అవమానంగా ఫీల్ అవుతుంటే..ఎన్నికల తర్వాత గాజువాక ఇంచార్జ్ గానైనా కొనసాగించకుండా, జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు కూడా లేకుండా చేయడంతో..తీవ్ర నిరాశలో ఉన్నారట గుడివాడ.అందుకే పార్టీకీ, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ సైలెంటైపోయారని టాక్ వినిపిస్తోంది. మంత్రిగా ఉన్నప్పుడు సీనియర్లను కూడా లెక్కచేయకపోవడం, తనంతటి వాడే పార్టీలో లేడు అన్నట్లుగా బిహేవ్ చేయడంతోనే..గుడివాడకు గ్రౌండ్ పాలిటిక్స్ తెలుసొచ్చేలా చేయడానికే పార్టీ స్కెచ్ వేసిందని అంటున్నారు. అసంతృప్తిలో ఉన్నప్పటికీ మళ్లీ పాత రోజులు వస్తాయని గంపెడు ఆశలతో ఎదురు చేస్తున్నారట గుడివాడ. ఆయన ఆశలు నెరవేరుతాయో లేదో చూడాలి మరి.

# తెలంగాణ రైతుల జీవితం భూమితో ముడిపడి ఉంది

**వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంది.**

**రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి**



జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి 24: రైతుభరోసా పథకంలో వానాకాలం పంట సాగు కొరకు రాష్ట్రంలోని 1 కోటి49 లక్షల ఎకరాలకు దాదాపు 70 లక్షల మంది రైతుల ఖాతాలలో 9 వేల కోట్ల రూపాయలు విజయవంతంగా జమ చేయడం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాజీవ్‌గంధీ విగ్రహ ప్రాంగణం నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇతర రాష్ట్ర మంత్రులు, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు లతో కలిసి రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో గల 1 వేయి 600 రైతు వేదికలలో జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ రైతుల జీవితం భూమితో ముడిపడి ఉందని, వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గత సంవత్సరం ఆగస్టు 15వ తేదీన రైతు రుణమాఫీ కార్యక్రమం ద్వారా 25లక్షల35వేల 964 మంది రైతులకు 20 వేల 617 కోట్ల రూపాయలు అందించి రుణ విముక్తులను చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 2 కోట్ల 80 లక్షల మెట్రిక్ టన్నుల పరిధాన్యం ఉత్పత్తి జరిగిందని, ప్రజా ప్రభుత్వ పాలనలో దళారుల నుండి విముక్తి కలిగించేందుకు కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరతో రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసి 48 గంటలలోగా సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరిగిందని, సన్నరకం వడ్లు పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు బోనస్ అందించడం జరిగిందని తెలిపారు. సంవత్సర కాలంలో దాదాపు 60 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించి ఎల్.బి. స్టేడియం వేదికగా నియామక పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు. రైతులు నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశమై వ్యవసాయంలో సాంకేతిక వినియోగంపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. 18 నెలల కాలంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతు భీమా, రైతు రుణమాఫీ, పంట కొనుగోలు, సన్నరకం వడ్లకు బోనస్ లలో మొత్తంగా 1 లక్షా 4 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. పంట సాగులో సేంద్రియ వ్యవసాయాన్ని అమలు చేసి ఆరోగ్యకరమైన పంట దిగుబడితో ప్రజల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తూ అవసరమైన పనిముట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తి దిశగా అడుగులు వేయడం జరుగుతుందని, తద్వారా ఉచిత విద్యుత్ అందడంతో పాటు మహిళలకు అదనపు ఆదాయం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. గిరిజన రైతుల సంక్షేమం కోసం ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని రాష్ట్రంలో ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఆర్థిక చేయూత ఇస్తూ ఒక సంవత్సరంలో 20 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు ఏకరూప దుస్తులు తయారు చేసేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ క్రింద స్వయం సహాయక సంఘాల మహిళలకు అవకాశం కల్పించి అదనపు ఆదాయాన్ని అందించడం జరిగిందని తెలిపారు. మహిళల ఆధ్వర్యంలో దాదాపు 1000 నూతన బస్సులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మహిళలతో రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల ఐ.కె.పి. కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు నిత్యావసర సరుకులు, తాజా కూరగాయలు, పండ్లు, పాలు, గ్రుడ్లు అందించేందుకు మహిళల ఆర్థికాభివృద్ధికి అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం క్రింద పేద రైతులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. వరితో పాటు లాభదాయకమైన పంటలు సాగు చేయడం, భూసారానికి అనుగుణంగా సాగు చేయవలసిన పంటలపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశం కల్పించి ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. అన్ని రంగాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు.జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల రైతు వేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరై మాట్లాడుతూ రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను జిల్లాలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. రైతు నేస్తం ద్వారా రైతులకు వంట సాగులో మెళకువలు అందించడం జరుగుతుందని, భూసారానికి అనుగుణంగా సాగు చేయవలసిన పంట వివరాలు తెలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, మండల వ్యవసాయాధికారి సుధాకర్, వ్యవసాయ విస్తరణాధికారి అరుణ్ కుమార్, సాంకేతిక ఎ.ఓ. శ్రీనివాస్, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 26న వాక్-ఇన్-ఇంటర్వ్యూ

**జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డావ హరీష్రజ్**

జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి 24: జాతీయ ఆరోగ్య మిషన్ విభాగం నందు యు.పి.హెచ్.సి.లో ఖాళీగా ఉన్న 2 పోస్టులు, ఎ.ఎ.ఎం.లో ఖాళీగా ఉన్న 2 పోస్టులను భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన ఉదయం 11 గంవలకు జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ కార్యాలయంలో వాక్-ఇన్-ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా,,హరీషారాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. యు.పి.హెచ్.సి.లలో 2 ఎం.ఓ. పోస్టులకు గాను ఎం.బి.బి.ఎస్. అర్హత కలిగి ఉండాలని, ఎ.ఎ.ఎం.లలో 2 ఎం.ఎల్.హెచ్.పి. పోస్టులకు గాను ఎం.బి.బి.ఎస్./ బి.ఎ.ఎంఎస్. అర్హత కలిగి ఉండాలని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సకాలంలో హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఈ నెల26న మినీ జాబ్మేళా

**జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ**

జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి 24: జిల్లా కేంద్రంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఈ నెల 26వ తేదీన ఉదయం 10.30 గంవ లకు మినీ జాబ్మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికఅష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియా-మంచిర్యాల శాఖలో మంచిర్యాల జిల్లాలో ఖాళీగా ఉన్న 100 (మహిళా కెరీర్ ఏజెంట్స్-భీమా శక్తి) పోస్టులను భర్తీ చేసేందుకు ఎస్.ఎస్.సి. పైన విద్యార్హత కలిగి, 18 సంవ ల పైన వయస్సు గల మహిళా అభ్యర్థులు అర్హులని, ఎం.ఎన్.సి. బ్యాంక్ కంపెనీ నందు తెలంగాణ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 60 రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టుల భర్తీ చేసేందుకు ఏదేని డిగ్రీ అర్హత కలిగిన 26 సం,,ల వరకు వయస్సు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 9912832330, 8096857078, 9110368501 నంబర్లలో సంప్రదించవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# స్వయం సహాయక సంఘాల సభ్యురాలి కుటుంబానికి భీమా చెక్కు అందజేత

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి 24:** స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణ భీమా, ప్రమాద భీమా క్రింద మృతి చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్తో కలిసి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రుణ భీమా క్రింద బ్యాంక్ రుణం తీసుకొని సక్రమంగా చెల్లిస్తున్న సమయంలో అకస్మాత్తుగా మృతి చెందినట్లయితే సభ్యురాలు చెల్లించవలసిన మిగిలిన రుణాన్ని గరిష్టంగా 2 లక్షల వరకు ప్రభుత్వం స్త్రీ నిధి ద్వారా చనిపోయిన సభ్యురాలి స్వయం సహాయక సంఘాల ఖాతాలో జమ చేస్తుందని, ప్రమాద భీమా క్రింద సభ్యురాలు నామినీగా నమోదు చేసిన కుటుంబ సభ్యులకు 10లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతలో జిల్లాలోని బెల్లంపల్లి మండలంలో ఇద్దరు సభ్యులకు సంబంధించిన సంఘ సభ్యులకు చెక్కులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి అంజయ్య, స్త్రీ నిధి ఆర్.ఎం. వెంకటరమణ, బెల్లంపల్లి మండల ఎ.పి.ఎం. శ్యామల, సి.సి. రామకృష్ణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# 27న చలో" కమిషనర్ కార్యాలయం"

**సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్ రావు**



**జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి24:** ఈనెల 27న చలో కమిషనర్ కార్యాలయం చేపట్టనున్నట్లు సిఐటియు మండల కన్వీనర్ కూటికల ఆనందరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో సమావేశం ఏర్పాట చేసి మాట్లాడారు.మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులకు గత రెండు నెలలుగా వేతనాలుఅందక కుటుంబ పోషణ కోసం దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు.గత సంవత్సరం కాలంగా పంచాయతీ ఉద్యోగులకు వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతున్నదని పేర్కొన్నారు.పంచాయతీ ఉద్యోగులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ప్రతి నెల చెల్లిస్తామని జనవరిలో ముఖ్యమంత్రిప్రకటించినప్పటికీ నేటికి అది అమలు కావడం లేదు అన్నారు.గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 51 మల్టీపర్పస్ వర్కర్ విధానం వల్ల రాష్ట్రంలో అనేక మంది కార్మికులు ఎలక్ట్రిషన్ స్తంభాలు ఎక్కి నైపుణ్యం లేని పనులు చేయడం వల్ల ట్రాక్టర్ ఎక్కి నడుపుతూ మఅత్యువాత పడ్డారని తెలిపారు. దీంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయని తెలిపారు.సంవత్సరాలుగా పారిశుద్ధ్య పనులలో నిమగ్నమై గ్రామాలను పరిశుభ్రంగాఉంచుతున్న వీరి పట్ల రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను అవలంబిస్తుందని విమర్శించారు.మా ప్రభుత్వం ఏర్పడితేమల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేస్తామని కనీస వేతనాలు అమలు చేస్తానని మాట తప్పారని అన్నారు.పంచాయతీ రాజ్ అధికారులు చర్చల సందర్భంగా 14 డిమాండ్ ను పరిష్కరించి, నెలరోజుల్లో వాటిని పరిష్కరిస్తామని పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు.వేతనాల కోసం అధికారులను సంప్రదిస్తేపట్టించుకోవడం లేదన్నారు. అందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 27న చలో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈలోపు ప్రభుత్వము అంగీకరించిన డిమాండ్స్ పై ఉత్తర్వులు జారీ చేయాలని లేని పక్షంలో51 జీవో సవరణంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామలలో ఆర్ ఎఫ్ ఎస్ వైద్య శిబిరాలు



**జననినాదం,సిర్పూర్(యు)24:** మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలోని గిరిజన గ్రామలలో వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు నిర్వహించారు. మండలంలోని ఖాతీగూడ,దేవుగుడా, గ్రామాల్లో ఆర్ ఎఫ్ ఎస్ కార్యక్రమం ఏర్పాటు చేసి గ్రామలలో ప్రతిఇంటింటికి తిరుగుతు జ్వరాలు, ఇతర వ్యాధుల గురించి వివరాలులను సేకరించి వారికి మందులు పంపిణి చేయడందం జరిందన్నారు. గ్రామలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు బీపీ, షుగర్, టీబీ వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వనితా మాట్లాడుతూ బీపీ, షుగర్, టీబీ వ్యాధులను గుర్తించి, చికిత్సలు జరుపుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వైద్య శిబిరాలను వినియోగించుకొని ఆరోగ్య స్థితిని మెరుగు పరుచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాల పరిశు భ్రత పై గ్రామస్తులకు అవగాహనా కలిపించారు. గర్బిణీలకు ప్రత్యేక వైద్యం నిర్వహించి వారికి మందులగురించి వివరించారు. రక్తహీనతతో బాధపడకుండా ప్రతిరోజు మందులు తీసుకోవాలని ఆహ్వాగాన కల్పించారు. ఈకార్యక్రమంలోఎఎన్ఎం కవితా,ఆశవర్కర్లు మీరాబాయి, మాదవి, రుక్మబాయి, జంగుబాయి, సోనాబాయి, రుక్మబాయి, దుర్పతాబాయి పాల్గొన్నారు.



# 12 మహిళా సంఘాలకు రూ.కోటి 50 లక్షల రుణం



**జననినాదం,బెల్లంపల్లి24:** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపాలిటీలో మహిళా సంఘాలకు బంపర్ ఆఫర్ వరించింది. బెల్లంపల్లి మున్సిపాలిటీలో చేపట్టిన100 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్- బెల్లంపల్లి బ్రాంచ్ 12 మహిళా సంఘాలకు రూ. 1.50 (కోటి యాభై లక్షల) ఋణాలు మంజూరు చేసింది.ఈ మేరకు కోటి యాభై లక్షల రుణం చెక్కును 12 మహిళా సంఘాల ఆర్ పీలు, మహిళలకీ అందజేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రావు బ్రాంచ్ మేనేజర్ బుచ్చయ్య, ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణ్, మెప్మా టీఎంసీ డి దుర్గయ్య, సి ఓ కిషోర్ ,మెప్మా ఆర్పీలు, ఆయా మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి పథకం కేసీఆర్ ఆలోచనే



**జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి24:** కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఆలోచన కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందనిఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ఎదుట కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎక్కువ పంపిణీ చేసి మాట్లాడారు. పేదెంటు యువతలకు ఈ పథకం ఎంతో తోడ్పడు తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. నిరుపేద యువతుల పెళ్లిళ్లకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకము బాసటమిచ్చిందన్నారు. 52 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పిటిసి దుర్పతాబాయి తాజా మాజి ఎంపీపీ పెందూర్ మోతిరామ్ తాజా మాజీ వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం టిఆర్ఎస్ నాయకులు ఎస్ కె యునుష్, తాసిల్దార్ భూమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలన మరో అవినీతి చేప



**జననినాదం,ఖానాపూర్ 24:** నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని గోడిసెర్యాల గ్రామ పంచాయతీ సెక్రటరీ శివ కృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికాడు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గోసుకుల రాజేశం అనే వ్యక్తి వద్ద నుండి 12 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. గోడిసెర్యాల గ్రామానికి చెందిన గోసుకుల రాజేశం గ్రామంలో వాటర్ ప్లాంట్ వేసుకోవడానికి పంచాయతీ సెక్రెటరీని పర్మిషన్ అడిగారు. దీంతో సెక్రటరీ శివ 12 వేల రూపాయలు డిమాండ్ చశాడని, దీంతో రాజేశం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడని తెలిపారు. మంగళవారం గోడిసెర్యాల గ్రామపంచాయతీ కార్యాలయంలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పంచాయతీ సెక్రటరీని ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు.

# అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

## ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**జననినాదం, భైంసా 24:** పర్యావరణ పరిరక్షణకు అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో శ్యామ్ ప్రసాద్ బలిదాన్ దివస్ కార్యక్రమాల సందర్భంగా మండల బీజేపీ ఆధ్వర్యంలో తులసి మొక్కల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలందరికి ఒకే దేశం ఒకే చట్టం ఉండాలన్న ఉద్దేశంతో భారతీయ జన సంఘ్ ను స్థాపించిన ఘనత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ దేనన్నారు. నేడు భారతీయ జనతా పార్టీ ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ 370 ఆర్టికల్ రద్దు చేయడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి మోదీ 11 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పలు కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు సిరం సుష్మ రెడ్డి, బీజేపీ నాయకులు సొలంకి భీమ్ రావ్, పెండ్ పెల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మహిళలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రైతు భరోసాలో 1 లక్షా 48 వేల 739 రైతుల ఖాతాలలో నగదు జమ

## జిల్లావ్యవసాయ అధికారి కల్పన



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి 24:** రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన రైతుభరోసా పథకంలో భాగంగా 1 లక్షా 48 వేల 739 రైతుల ఖాతాలలో 189 కోట్ల 37 లక్షల 10 వేల 233 రూపాయలు జమ చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 మండలాలలోని 419 గ్రామాలలో 1 లక్షా 71 వేల 307 మంది రైతులకు 205 కోట్ల రూపాయల రైతు భరోసా అందించవలసి ఉండగా 1 లక్షా 52 వేల 621 మంది రైతులకు సంబంధించిన 198 కోట్ల 96 లక్షల 63 వేల 519 రూపాయలు ప్రభుత్వ ఖజానాకు పంపించడం జరిగిందని, 1 లక్షా 48 వేల 739 రైతుల ఖాతాలలో 189 కోట్ల 37 లక్షల 10 వేల 233 రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు.

# బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

## పార్టీ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్

### రైతుభరోసాతో వ్యవసాయం పండగ అయ్యిందని స్పష్టీకరణ



**జననినాదం,తిర్యాణి 24:** బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం తిర్యాణి మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్ అన్నారు. రైతు బరోసా సంబరాల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలు తో పాటు రైతాంగ ఆదుకునే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని పేర్కొన్నారు తిర్యాణి మండలంలో 76,77 మంది రైతులు ఉండగా రూ.14 కోట్ల రైతు భరోసానిధులు వారి వారి ఖాతాలో జమైనట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ పనులు ఆరంభమయ్య సమయంలో రైతులకు రైతుబంధు భరోసా అందించి ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్ర రైతంగాని ఆదుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పెరుమండ్ల వెంకటేశం గౌడ్, బల్లం శంకర్, పులి కొమురయ్య, మండల యూత్ అధ్యక్షులు పున్నం కుమార్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు పెరుమండ్ల రంజిత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ సకురా అంతర్జాతీయ సైన్స్ కార్యక్రమంలో జిల్లా విద్యార్థిని ప్రతిభ



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి 24:** జపాన్ సకురా అంతర్జాతీయ సైన్స్ కార్యక్రమంలో జిల్లా విద్యార్థిని శ్రీవల్లి పాల్గనడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో జాతీయ స్థాయి ఇన్స్పైర్ పోటీలలో అద్భుత ప్రదర్శన అందించి రాష్ట్రపతి అభినందనలు పొంది అంతర్జాతీయ స్థాయి సైన్స్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీవల్లిని జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు లతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15 నుండి 21వ తేదీ వరకు అంతర్జాతీయ స్థాయి సైన్స్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీవల్లి జపాన్లోని యూనివర్సిటీలు, అంతరిక్ష కేంద్రం, పాఠశాల, మ్యూజియంలను సందర్శించి విజ్ఞానాన్ని పొందిందని, ఆధునిక సాంకేతిక జ్ఞానాన్ని పొంది భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం "ఇన్స్పైర్ అవార్డ్స్ మానక్", ఇన్స్పైర్ అవార్డుల కొరకు నామినేషన్ల సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేందుకు, వారిలోని వినూత్న ఆలోచనలు బహిర్గతం చేసి నూతన ఆవిష్కరణలు రూపొందించి సమాజంలోని వివిధ సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించేందుకు ఇన్స్పైర్ అవార్డ్స్ మానక్ వేదికగా పని చేస్తుందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఇన్స్పైర్ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలలో 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల నుండి నామినేషన్లు స్వీకరించాలని, ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో స్టాప్-డయేరియా కార్యక్రమాన్ని పకడ్బంధీగా చేపట్టాలి



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి 24:** జిల్లాలో స్టాప్-డయేరియా కార్యక్రమాన్ని పకడ్బంధీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా,, హరీష్రజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ లతో కలిసి స్టాప్-డయేరియా సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జూలై 31వ తేదీ వరకు చేపట్టిన స్టాప్-డయేరియా కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బంధీగా నిర్వహించాలని తెలిపారు. అతిసార వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని, ఆహారం తీసుకునే సమయంలో తప్పనిసరిగా చేతులు శుభ్రపరుచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లలు తల్లిపాలు త్రాగకపోవడం, వాంతులు అధికంగా కావడం, తరుచుగా మల విసర్జన, అనారోగ్యానికి గురి కావడం, అపస్మారక స్థితి, జ్వరం ఉండటం, వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఇతర అనారోగ్య లక్షణాలు గుర్తించినట్లయితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్ళి సరైన సమయంలో వైద్య సేవలు పొందాలని తెలిపారు. స్టాప్-డయేరియా కార్యక్రమంలో భాగంగా ఓ.ఆర్.ఎస్., జింక్ కార్నర్లు ఏర్పాటు చేయడం, 5 సం,,ల లోపు పిల్లలలో అతిసార వ్యాధిని నిర్మూలించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, వైద్యాధికారులు డా,, కృపాబాయి, డా,, ప్రసాద్, డా,, సుధాకర్ నాయక్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రైతు పండగ సంబరాలు ఎందుకోసం?

## రైతు భరోసా నాలుగు విడతలు ఎగ్గొట్టినందుకా? : నిరంజన్ రెడ్డి




హైదరాబాద్ : కాంగ్రెస్ రైతు పండుగ సంబురాలపై మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ రైతు పండగ సంబరాలు ఎందుకోసం? రైతు భరోసా నాలుగు విడతలు ఎగ్గొట్టినందుకా? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ కంటే ఎక్కువ ఇస్తాం.. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.12 వేలకు కుదించి.. అది కూడా ఇవ్వనందుకా? అని నిలదీశారు. రూ.2 లక్షలు రుణమాఫీ అని చెప్పి అరకొర చేసి ఎగ్గొట్టినందుకా? ఏ కారణం చేత రైతు మరణించినా ఆ కుటుంబానికి ధీమాగా ఉండాలని రూ.5 లక్షల సాయం అందించే రైతుబీమా రాకుండా చేసినందుకా? ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో దాదాపు 550 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా? వానాకాలం పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్ బకాయిలు ఎగ్గొట్టినందుకా? యాసంగి పంటకు క్వింటాలుకు రూ.500 అసలు బోనస్ ఇవ్వనందుకా? కల్లాలకు వచ్చిన ధాన్యం నెలల తరబడి కొనకుండా కండ్ల ముందు అకాల వర్షాల పాలయ్యేలా చేసి కన్నీళ్లు పెట్టించినందుకా? కల్లాల్లో ధాన్యం ఉండగానే వాటిని కొనకుండా కొనుగోలు కేంద్రాలు ఎత్తేసినందుకా? పదేళ్ల కేసీఆర్ పాలనలో ఆత్మవిశ్వాసం నింపుకుని ఆత్మస్థైర్యంతో ఉన్న రైతులను కేవలం 18 నెలల పాలనతో నిండా ముంచి, వ్యవసాయం నడ్డి విరిచినందుకా? అని ప్రశ్నించారు. లగచర్ల రైతులను జైలుకు పంపినందుకా? పెద్ద ధన్వాడ రైతులకు బేడీలు వేసినందుకా? ఐదు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో కేసీఆర్ లాగా ఒక్క పథకం అయినా ప్రవేశపెట్టారా? కోటి 50 లక్షల ఎకరాలకు నాలుగు విడతల్లో ఎకరాకు రూ.30 వేల చొప్పున ఈ ప్రభుత్వం రైతులకు ఎగ్గొట్టింది. నాలుగు విడతలుగా ఎగ్గొట్టిన రైతు భరోసా స్థానిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారు అన్న భయంతో అయినా రైతు భరోసా వేస్తున్నారని.. సచ్చినోని పెళ్లికి వచ్చిందే కట్నం అని రైతులు సరిపెట్టుకుంటున్నారు తప్ప సంబరాలు చేసుకోవడం లేదు. నాలుగు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పండగ పేరుతో సంబరాలు చేయాలి అనడాన్ని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.

# వైసీపీ అధినేత జగన్‌పై మరో కేసు నమోదు



**గుంటూరు మిర్చి యార్డు పర్యటన వివాదం**
**ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి,**
**అనుమతి లేకుండా ప్రసంగించారని ఆరోపణ**
**జగన్‌తో పాటు అంబటి, మరికొందరు వైసీపీ నేతలపైనా కేసు**
**41ఏ నోటీసులు జారీ చేసిన నల్లపాడు పోలీసులు**

అమరావతి,: ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ పై మరో పోలీసు కేసు నమోదైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 19న గుంటూరు మిర్చి యార్డులో ఆయన జరిపిన పర్యటనకు సంబంధించి ఈ కేసు దాఖలైంది. అప్పట్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలులో ఉండగా, నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే... ఫిబ్రవరి 19న మిర్చి రైతులను పరామర్శించేందుకు జగన్ గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లారు. అయితే, ఆ సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, వైసీపీ నేతలు ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా యార్డుకు వచ్చి హడావుడి చేశారని ఆరోపణలున్నాయి. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నడిచే ప్రభుత్వ ప్రాంగణమైన మిర్చి యార్డులో జగన్ రాజకీయ ప్రసంగాలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో జగన్‌తో పాటు మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైసీపీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, కావటి మనోహర్‌నాయుడు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి తదితరులపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. వీరందరికీ ఇప్పటికే సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేశారు. పోలీసులు పిలిచినప్పుడు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని ఆ నోటీసుల్లో సూచించారు. కాగా, పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన ఘటనలోనూ జగన్‌పై కేసు నమోదైన విషయం విదితమే. తాజాగా గుంటూరు మిర్చి యార్డు ఘటనతో ఆయనపై మరో కేసు నమోదైనట్లయింది.

## ఇరాన్ దాడికి నలుగురు ఇజ్రాయిలీలు మృతి

ఇజ్రాయిల్ : ఇరాన్ ఇజ్రాయిల్‌లోని బిర్షెబాలోని నివాస భవనంపై క్షిపణులతో దాడి చేసింది. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో జరిగిన ఈ దాడిలో ఆ భవనంలో నలుగురు నివాసితులు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ విషయాన్ని ఇజ్రాయిల్ మీడియా పేర్కొంది. ఇరాన్- ఇజ్రాయిల్ మధ్య గత కొన్నిరోజులుగా దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని ప్రకటించారు. అయితే ఈ ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల తర్వాతే ఇరాన్ ఇజ్రాయిల్‌పై క్షిపణి దాడికి పాల్పడడం గమనార్హం. ఇరాన్ ఆరుసార్లు క్షిపణులను ప్రయోగించినట్లు ఇజ్రాయిల్ పేర్కొంది.

# మరో కొత్తరెండు మున్సిపాల్టీలు

హైదరాబాద్, జూన్ 24,: ష్ట్రంలో కొత్తగా రెండు మున్సిపాలిటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సంగారెడ్డి జిల్లాలోని ఇంద్రేశం, జిన్నారం గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జిన్నారం, ఇంద్రేశం ప్రాంతాలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. ఈ ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, జనాభా పెరుగుదల, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాల నేపథ్యంలో ఈ డిమాండ్ తెరపైకి వచ్చిందిఈ రెండు గ్రామాలు పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. పటాన్ చెరు పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం. ఇక్కడ అనేక పరిశ్రమలు ఉండటం వల్ల జనాభా పెరుగుదల అధికంగా ఉంది. దీంతో ప్రాథమిక సదుపాయాలు, పట్టణీకరణ అవసరాలు పెరిగాయి. ఈ ప్రాంతాలు హైదరాబాద్ నగరానికి ఆనుకుని ఉండటం, ఇక్కడ పెద్ద ఎత్తున పారిశ్రామిక కార్యకలాపాలు సాగడం, రియల్ ఎస్టేట్ రంగంలో గణనీయమైన వృద్ధి కనిపించడంతో, పట్టణ అవసరాలు గ్రామ పంచాయతీల పరిధిలో తీర్చడం కష్టతరంగా మారింది. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక వసతులను మెరుగుపరచడానికి మున్సిపల్ హోదా అవశ్యకతను స్థానిక ప్రజలు, నాయకులు తెరపైకి తీసుకొచ్చారు. మున్సిపాలిటీలుగా మారితే నిధుల కేటాయింపులు పెరుగుతాయని.. తద్వారా అభివృద్ధి వేగవంతం అవుతుందని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్ వంటి సమీప గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలుగా మారినందున జిన్నారం, ఇంద్రేశం కూడా మున్సిపాలిటీలుగా మారాలని డిమాండ్ బలంగా వినిపించింది. ఈ నేపథ్యంలోనే జిన్నారం, ఇంద్రేశం గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో పాటుగా ఇస్నాపూర్ మున్సిపాలిటీని కూడా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీల్లో కమిషనర్లతో పాటు వివిధ విభాగాల్లో 316 పోస్టుల భర్తీకి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ నిర్ణయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిమాండ్ నెరవేరిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామాలు మున్సిపాలిటీలుగా ఏర్పడటం వల్ల ఈ ప్రాంతాలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460